# ఒక దృశ్యం: మరొక చిత్రం



**మానవుని ప్రగతి ప్రకృతికి గొడ్డలిపెట్టుగా మారుతోందన్నది నిజం. చివరకు ఇది పరిష్కారమే లేని సమస్యగా మిగిలిపోతుందా అని విశ్వనాథరెడ్డి ప్రశ్నిస్తున్నారు.**

ఊరి నుంచి చిన్నాన్న పంపిన డబ్బు రామానుజులుకు సమయానికి అందింది. చివరి సంవత్సరం పరీక్షలు బాగా రాసి, డిస్టింక్షన్ తప్పక వస్తుందనుకుంటున్న సంతోష తరుణంలో ఆ డబ్బు అందింది. ఆటవిడుపుగా ఒక వారం రోజులపాటు సత్యనారాయణ వెంట విశాఖపట్నం, అరకులోయ చుట్టి ఇంటికి పోదామనుకున్న నిర్ణయం ఒక కొలిక్కి వస్తుందో రాదో, సఫలమవుతుందో కాదో అని సందేహంలో మునిగిన క్షణాల్లో అందింది. డబ్బు చేతిలో పడుతూనే రామానుజులుకు వాళ్ళ చిన్నాన్న మీద ప్రేమ పెల్లుబికింది. గౌరవం మరింత పెరిగింది. పిల్లల అవసరాల్ని గుర్తించగలిగిన పెద్దవాళ్ళ మమకారానికి విలువ కట్టలేం అనుకున్నాడు.

పరీక్షలకు ఒక నెల ముందు రూంమేటు సత్యనారాయణ రామానుజులును ఒక రోజు అర్ధ రాత్రి ఆత్మీయంగా ఎన్విరాన్‌మెంట్ ఇంజనీరింగ్ డిజైన్స్ పేపరును ఇద్దరూ కలిసి మథిస్తున్నప్పుడు మధ్యలో అడిగాడు:

"మా నాన్నకు నువ్వంటే ఇష్టం. ఈ నాలుగేళ్ళలో ఇక్కడికి మూడు నాలుగుమార్లు వచ్చి నిన్ను చూశాడు కదా. ఏమన్నాడో తెలుసా? నువ్వు నా రూంమేటుగా దొరకటం నా అదృష్టమట. ఎలాగూ మన చదువు ముగుస్తోంది. మా ప్రాంతాలు నువ్వు చూళ్ళేదు కూడా. సముద్రం కూడా నువ్వింతవరకు చూళ్ళేదన్నావు, ఒకమారెప్పుడో. కదా? మా విశాఖలో రెండు రోజులు సరదాగా తిరగవచ్చు. ఉక్కు ఫ్యాక్టరీ, హార్బర్, మిగతా ఇండస్ట్రీస్ ఓపికుంటే చూడొచ్చు. ఆంధ్రా యూనివర్సిటీ కాంపస్‌లోనే మేముండేది. క్వార్టర్స్ బావుంటాయి. నువ్వు ఇష్టపడతావు. అక్కణ్ణుంచి అరకు వెళ్లాం. వెళ్ళేటప్పుడు రైల్లో వెళ్దాం. తిరిగి వచ్చేటప్పుడు బస్సులో వద్దాం. అరకులోయ యమాగా ఉంటుంది. నీకింకా బాగుంటుందనుకో. అరకులో అన్నయ్య ఇటీవలే ఫారెస్టాఫీసరుగా చేరాడు. పైగా, పెళ్ళి కాలేదు. అన్నయ్యతోనే మనం నాలుగైదు రోజులుందాం. తర్వాత మీ ఊరు వెళ్దువు గానీ. మనకు కావలసింది చార్జీలు, జేబుఖర్చులే కదా? నువ్వు వచ్చితీరాలి."

సత్యనారాయణకాక మరొకరెవరైనా పిలిచి ఉంటే "నేరుగా మా ఊరుకు పోవాల" అని ఉండేవాడు రామానుజులు. సత్యనారాయణ అంటే రామానుజులుకు చచ్చేంత ఇష్టం.

నాలుగేళ్ళు క్లాస్‌మేట్. ఒకే రూంమేట్. రాష్ట్రేతర ప్రాంతంలో - కొల్హాపూర్‌లో - కష్టసుఖాలన్నిటిలో తోడున్నవాడు. పోయిన సంవత్సరం చెల్లెలు పెళ్ళికి పిలుస్తూనే విశాఖ నుంచి ఊరొచ్చాడు. మిత్రుడి పిలుపును రామానుజులు కాదనలేకపోయాడు.



చిత్రాలు: నర్సిం

ఇప్పుడు డబ్బులు చేతిలో ఉన్నాయి. రామానుజులుకు జమాఖర్చుల పద్దులు తలలో మెదల్లేదు. అనుభవదాహం అధికమైంది. సుకుమారమైన అనుభూతులు తొందరించాయి. తన ఎన్విరాన్‌మెంటల్ ఇంజనీరింగ్ చదువుకు అవసరమయ్యే మరింత ప్రత్యక్ష జ్ఞానమేదో అందుతుందని ఆరో ఇంద్రియం ఆరాటపెట్టింది. సత్యనారాయణ వెంట రామానుజులు బయలుదేరాడు.

ఆంధ్రా యూనివర్సిటీ ఆవరణలోని రకరకాల పెద్ద పెద్ద చెట్లనూ, అక్కడి వృక్షసంపదనూ చూసి, సత్యనారాయణ వాళ్ళుంటున్న క్వార్టర్స్ కాంపౌండ్‌లోని ఒక పెద్ద చెట్టుకు కట్టిన ఉయ్యాలలో ఊగి రామానుజులు ఆకులో ఆకయ్యాడు; పూవులో పువ్వయ్యాడు; నునులేత రెమ్మయ్యాడు. నగరంలోని ఆ అడవి కాని అడవిలో దాగిపొయ్యాడు. ఊగిపొయ్యాడు. క్వార్టర్స్ కాంపౌండ్‌లో చెట్ల నుంచి రాలిన నేరేడుపండ్లను చిన్నపిల్లవాడిలాగా ఏరుకొని, తుడుచుకొని చప్పరించి, వగరును ఆనందించాడు. స్కూల్లో చదువుకునేటప్పుడు ఊళ్ళోని చెట్లెక్కి బంకీరకాయలు, జమ్మికాయలు, చీమచింతకాయలు తిన్న బాల్యానందం కంటే ఎక్కువగా ఆనందాన్ని అనుభవించాడు - ఆ క్వార్టర్స్ చుట్టూ ఉన్న పండ్లచెట్ల మధ్య. ఊళ్ళో ఇంటికి ఆనుకునే ఉన్న కళ్ళంలోని బ్రహ్మాండమైన వేపచెట్టుతో ఉండిన బాల్య స్మృతులు ఆ సమయంలో వెలికివచ్చాయి. తమ ఊరి పర్యావరణ సంపదలో పెద్ద భాగంగా నిలిచిన తమ సొంత వనం - ఎల్లమ్మ వనం - గిలిగింతలు పెట్టింది. ఆ వనంలో చిన్నప్పుడాడిన ఆటలూ, వర్షాకాలంలో ఉరుములు ఉరిమినప్పుడు పుట్టగొడుగుల కోసం వెతుకులాటా జ్ఞాపకానికి వచ్చాయి. ఊరి గొడ్లన్నీ ఆ నీడల్లో రోజూ సేదదీరే దృశ్యం కళ్ళలో మెదిలింది.

రామానుజులును యారాడ కొండ ఆకట్టుకోలేదు. సముద్రం మాత్రం అది చూసినంతసేపూ గుండె గొంతుకలో కొట్లాడింది. రామానుజులుకు విశాఖ నచ్చింది. పరిశ్రమల కాలుష్యంలో సైతం నచ్చింది; సముద్రం పీతల కూరలో కూడా నచ్చింది. అప్పాయమ్మలు, సూకాలమ్మలు, సింహాచలాల చీరకట్లు, తోడాలు, కడియాలు, బులాకీలు, చెవి ఆభరణాల్తో సాగిన చెవులు - వీటన్నిటిలో నచ్చింది. అడ్డపొగలో కూడా నచ్చింది.

అరకులోయలోకి అడుగుపెడుతూనే రామానుజులుకు ఏదో అద్భుత లోకంలోకి వచ్చినట్లయింది. కంటి చూపు పారినంతవరకూ ముదురుపచ్చ పట్టుచీరలు

రామానుజులును యారాడకొండ ఆకట్టుకోలేదు. సముద్రం మాత్రం అది చూసినంతసేపూ గుండె గొంతుకలో కొట్లాడింది.

కట్టుకున్నట్లు ఆ కనుమలూ, చిక్కటి తోపులూ, చల్లటి గాలి గుసగుసలూ, చెట్లమీద రంగురంగుల పక్షులూ, చెట్లకు వేలాడే కబోదిపిట్టలూ, గర్భిణీ స్త్రీల్లాగా నడిచే మబ్బులూ, వానచినుకుల వలచటి తెర వెనుక కనిపించీ కనిపించకుండా కదలాడే వచ్చటి నీడలు చూస్తూ 'ఇంత ఇంత పర్యావరణ సౌభాగ్యం మన దేశంలోనే, మన రాష్ట్రంలోనే ఉందా?' అని విస్మయపడ్డాడు. సత్యనారాయణ అన్నయ్య జగదీశ్వరరావు ముందు మూడోరోజు సాయంత్రం రామానుజులు తన విస్మయాన్ని ప్రకటించాడు.

తమ్ముడివైపు చూసి జగదీశ్వరరావు నవ్వుతూ రామానుజులును మెచ్చుకున్నాడు.

"రామానుజులుకు కవులకుండవలసిన భావుకత్వం ఉంది."

రామానుజులు ఆ మాటకు సిగ్గుపడ్డాడు. సంకోచంగా అడిగాడు:

"నాకు కవిత్వం రాదు సార్. అయినా, భావుకత్వం కవుల గుత్తసొత్తేమీ కాదుకదా సార్? మీరు ఎం.ఎస్‌సి బాటనీ చదివారనీ, ఎం.ఫిల్ కూడా చేశారనీ సత్యం నాతో అన్నాడు. మీరు కావాలనే, ఇష్టపడే ఈ ఉద్యోగం ఎంచుకున్నారని కూడా సత్యం అన్నాడు. ఏమాత్రం భావుకత్వం లేకుండా ఇక్కడ ఈ ఉద్యోగం చెయ్యగలరా?"

"నాకా భావుకత్వం?" జగదీశ్వరరావు బిగ్గరగా నవ్వాడు.

ఏం చెబుతాడోనని జగదీశ్వరరావు ముఖంలోకి రామానుజులు చూస్తున్నాడు. గార్డు టీ తెచ్చాడు.

"ముందు టీ తాగండి" అన్నాడు జగదీశ్వరరావు.

ముగ్గురూ టీకప్పులందుకున్నారు.

టీని నెమ్మదిగా పీలుస్తూ జగదీశ్వరరావు చెప్పాడు:

"ఇక్కడ కావలసింది భావుకత్వం కాదు. ఉద్యోగలక్ష్యం, అడవుల్ని కాపాడే ధర్మం... అన్నట్లు ఈ లోయలోని గిరిజనుల్ని గమనించే ఉంటారు."

గత సాయంకాలం వాగులో నీటికీ, స్నానానికీ వచ్చిన గిరిజన స్త్రీల అర్ధనగ్న శరీరాల్ని రామానుజులు చూడకపోలేదు. దుమ్ముగుడ్డిలో, కంతబవునుగూడలో, చొంపిలో చొచ్చుకొని వస్తున్న నాగరికత మధ్య చూసిన మారీమారని గిరిజన జీవితాన్ని మిత్రులిద్దరూ గమనించకపోలేదు; చర్చించకపోలేదు. అందుకే జగదీశ్వరరావు ప్రశ్నకు రామానుజులు తలాడించాడు.



జగదీశ్వరరావు చిన్న ఉపన్యాసానికి సిద్ధమై ఉన్నట్లు ఆరంభించాడు.

'ఈ అరకులోయ విస్తీర్ణం ఎంతో తెలుసా? 361 చదరపు మైళ్ళు. అరకు చుట్టుపట్ల డెబ్బై ఎనభై గిరిజన గూడేలున్నాయి. ఇంత అటవీ సంపద ఉంది. మరో ఇరవై ముప్పై ఏళ్ళవరకు ఈ సంపదంతా ఉంటుందా అనేదే పెద్ద ప్రశ్న. అసలు గుట్టు కొంత లోపలికి వెళ్తే తెలుస్తుంది. ఏదో జబ్బు చేసి ఈకెలూడిన కోళ్ళలాగా కొండచాళ్ళు కనిపిస్తాయి. పోడు...పోడు వ్యవసాయం. అరకు మీ ప్రాంతంలోని కొండల్లాగా అయిపోతుందనే భయం. పోడును మాన్పించాలని మా ప్రయత్నం. కాఫీ ప్లాంటేషన్లతో వాళ్ళను మార్చాలని ప్రయత్నం. పర్యావరణ సమతూకం దెబ్బతినకుండా ప్లాంటేషన్ ప్రాజెక్టు అభివృద్ధిచేయాలని చూస్తున్నాం. ఇక్కడ భూమి కోతను నివారించటం ఒక సమస్య. భూసారాన్ని కాపాడ్డం మరొక సమస్య. వృక్షసంపదను రక్షించటం, పెంచటం మరొక పెద్ద సమస్య. అందుకే ఈ ఉద్యోగం ఎన్నుకుంది. ప్లాంటేషన్ ప్రాజెక్ట్ ఇన్‌చార్జి నేను...."

"ఇది భావుకత్వమేకద సార్?" రామానుజులు ప్రశ్నకు జగదీశ్వరరావు నవ్వాడు.

"ఏదో ఒకటి...తిరుపతి కొండ మీద వరుసగా కూచోబెట్టి గుండ్లు గొరిగినట్లు అడవుల్ని గొరిగితే ఏదీ మిగల్దు." జగదీశ్వరరావు మనిషంతా కదలిపోతూ నవ్వి, చల్లారిన టీని తాగటం పూర్తిచేశాడు.

అన్నయ్య వేసిన జోకుకు సత్యనారాయణ పడిపడీ నవ్వాడు. రామానుజులు నవ్వినా, ఎక్కడో కలుక్కుమంది.

జగదీశ్వరరావు మరిన్ని వివరాలు ప్రస్తావించాడు.

"ఇక్కడి గిరిజనులు ఇటికెల పండుగ అని ఒకటి ప్రతి ఏడాదీ జరుపుకుంటారు. ఎనిమిది దినాలుంటుంది అది. మగవాళ్ళంతా వేటకు వెళ్ళాలి. వేటాడి తేవాలి. పంచుకోవాలి. మేము వేటను నిషేధించినా జంతువులకూ, పక్షులకూ అంతో ఇంతో నష్టం ఉండి తీరుతుందికదా? ఇక్కడి జీవావరణం కూడా సంక్షోభంలో ఉంది."

"అడవుల్ని కాపాడ్డానికి మనకు అమెజాన్‌లోలాగా చిప్కో ఉద్యమం లాంటిది వస్తే బాగుంటుంది." సత్యనారాయణ తొలిసారిగా నోరు విప్పాడు.

"అప్పికో ఉద్యమం ఉందికదా - కేసు నడుపుతున్నది." రామానుజులు జగదీశ్వరరావు వైపు తిరిగి 'మీ అభిప్రాయం చెప్పండి' అన్నట్లు చూశాడు.

కుర్రాడు తెలివైనవాడే అనుకుంటూ రామానుజులుతో జగదీశ్వరరావు అన్నాడు:

"ఇక్కడి సమస్య అదికాదు. చదువుకున్న వాళ్ళెవళ్ళో పదిమంది చెట్లను చేతుల్తో చుట్టి చెట్లు నరకవద్దంటే తీరే సమస్య కాదు ఇది. గిరిజనులు మారాలి - అసలు అనర్థానికి కారణం వాళ్ళే కాబట్టి."

రామానుజులు అనుమాన నివృత్తి కోసం అడిగాడు:

"సర్దార్ సరోవర్, తెహ్రి, కోయర్‌కార్, సువర్ణరేఖ హైడల్ ప్రాజెక్టులకు వ్యతిరేకంగా జరిగే ఆందోళనలన్నీ అంతేనంటారా?"

జగదీశ్వరరావు తబ్బిబ్బుపడ్డాడు. టేబులు మీదున్న టీకప్పు, సాసరుతో ఆడుకుంటూ తనలో తాను ఆలోచించుకుంటున్నట్లుగా అన్నాడు:

"అవి అభివృద్ధికి వ్యతిరేకంగా జరిగే గొడవలు..."

సరిగ్గా ఆ సనుగుడప్పుడే విశాఖ నుంచి కన్సర్వేటర్ కుటుంబంతోసహా వచ్చి గెస్ట్ హౌస్‌లో ఉన్నాడన్న వార్త వచ్చింది. జగదీశ్వరరావు హడావిడిగా బయటకు వెళ్ళిపోయాడు.

అరకులో రామానుజులు, సత్యనారాయణ మరిరెండు రోజులున్నారు. ఆ రెండు రోజుల్లో జగదీశ్వరరావుకు తీరికేలేదు.

అరకు నుంచి విశాఖ, విజయవాడ, ప్రొద్దుటూరుల ద్వారా స్వగ్రామానికి తిరిగి వస్తున్నప్పుడు రామానుజులు జగదీశ్వరరావుతో చర్చించిన విషయాలు గురించి, తాను ప్రత్యక్షంగా చూసిన దాన్ని గురించి తెగ ఆలోచించాడు. తన నాలుగేళ్ళ చదువుకు, పర్యావరణ సమస్యలకు మధ్య ఉండే విషమ సంబంధాన్ని గురించి మథనపడ్డాడు. ఆలోచనలు గజిబిజిగా, చిందరవందరగా సాగాయి. ఆలోచనలకూ, ప్రకృతిలోని సమస్యలకూ, అనుభూతులకూ మధ్య లంకెలు లేవు. దొరకలేదుకూడా. నీటి పారిశుధ్యం, వాయు కాలుష్యం, పరిశ్రమలు విడిచే కాలుష్యం, తుక్కు పారిశుధ్యం, పారిశ్రామిక ఆరోగ్యం, డిజైన్లూ వగైరా పాఠ్య ప్రణాళికలలోని అంశాలన్నిటినీ తాను శ్రద్ధగా చదివాడు. వాటికీ, అరకు లోయలో కూలుతున్న సౌందర్యానికీ, మిగిలిన సౌభాగ్యానికీ సంబంధం లేదనుకున్నాడు. రోగ కారణాలు తెలియని రోగ చికిత్సను మాత్రమే తన చదువు తనకు నేర్పిందేమో అనే అనుమానంలో పడ్డాడు. రామానుజులును మరింత అయోమయంలో పడవేసిన పదం జగదీశ్వరరావు ప్రస్తావించిన అభివృద్ధి. పోడు వ్యవసాయం కోసం అడవుల్ని నరకటం, అభివృద్ధి పేరుతో కాఫీతోటల్ని పెంచటం, సర్దార్ సరోవర్ అభివృద్ధికి వ్యతిరేకంగా ఉద్యమం నిర్వహించటం - వీటి మధ్య పొంతన కనపడటం లేదు. రామానుజులుకు ప్రకృతి ఒక పద్మవ్యూహంలాగా కనిపించింది. యాత్రలో రామానుజులు ఒక్కటి మాత్రం కచ్చితంగా అనుకున్నాడు: 'పర్యావరణాన్ని

పాఠ్య ప్రణాళికలలోని అంశాలన్నిటినీ తాను శ్రద్ధగా చదివాడు. వాటికీ, అరకు లోయలో కూలుతున్న సౌందర్యానికీ సంబంధం లేదనుకున్నాడు.

జీవావరణాన్ని కాపాడుకునే తపన మనిషన్న వాడికి అవసరం.'

విజయవాడ - ప్రొద్దుటూరు బస్సులో ప్రొద్దుటూరులో దిగి రామానుజులు ప్రొద్దుటూరు - పులివెందుల బస్సెక్కాడు. ముద్దనూరు దాటి, దుద్యాల దాటి మల్యాల కనుమగుండా బస్సు వెళ్తోంది. కిటికీ లోంచి కొండల్ని - బోడిగుండ్లలాంటి కొండల్ని చూసి రామానుజులు - ఎన్నోసార్లు చూసినవే అయినా అప్పుడు - 'దారుణం, ఘోరం' అనుకున్నాడు. మల్యాలసత్రం వద్దకు బస్సు వచ్చేసరికి రామానుజులుకు ఊరిగాలి సోకింది. ఊరివాసన వేసింది. మల్యాలసత్రం ముందున్న చెట్లను చూసి ఆనందమైంది. మసీదు కనపడుతోంది. చెట్లూ, ఇళ్ళూ, కళ్ళాలూ, వాములూ కనపడుతున్నాయి. కన్నఊరు వచ్చేసింది. గుండెల నిండుగా ఊపిరి పీల్చుకొని సామాన్లు సర్దుకొని స్టాప్‌లో దిగాడు.

తొమ్మిది నెలల తర్వాత వచ్చిన ఇంజనీరు కొడుకును చూసి కన్న తల్లి కళ్ళతోనే పలకరించి సంతోష పడింది. చిన్నాన్న కుశలప్రశ్నలతో రామానుజులు కడుపు నిండి పోయింది. చిన్నాన్న గాంభీర్యాన్ని చూస్తే రామానుజులుకు భయం, అభిమానం కూడా. చిన్నాన్న పిల్లలు - చదువబ్బక వ్యవసాయంలోకి దిగిన పద్నాలుగేళ్ళ తమ్ముడూ, ముగ్గురు చెల్లెళ్ళూ అరకు నుంచి రామానుజులు అపురూపంగా, అతి జాగ్రత్తగా తెచ్చిన పెద్ద పనసపండును చూసి ఆశ్చర్యపోయారు. "ఎట్లా కొయ్యాల? ఎట్లా కొయ్యాల? ఎట్లా తినాల?" అంటూ రామానుజులును చుట్టుకున్నారు. సత్యనారాయణ అరకులో నేర్చిన మెలకువల్ని ప్రదర్శించి, రామానుజులు పండు కోసి, తొనలు తీశాడు. పండు వాసన పిల్లలందరికీ గమ్మత్తుగా ఉంది. తొనల రుచి అందరికీ నచ్చింది.

రాత్రి పొద్దుపోయేంతవరకు తమ్ముడికి, చెల్లెళ్ళకు అరకు విశేషాలను రామానుజులు విసుగు పడకుండా చెబుతూనే ఉన్నాడు. దూరంగా మంచంలో పడుకొని చిన్నాన్న వింటున్నట్లు గమనించక పోలేదు. రామానుజులు చెప్పటం ఆపి మంచినీళ్ళు తాగుతున్నప్పుడు చిన్న చెల్లెలు ఒక ప్రశ్న వేసింది.

"మనకిన్ని కొండలున్నాయే. అడవెందుకు లేదు?"

"ఒకప్పుడుండేదంట. మల్యాల కనుమంటే ఏందనుకున్నావు? మజాకా? రాములుతాతనడుగు, మన కనుమ సంగతి." తమ్ముడన్నాడు.

"ఇప్పుడెందుకు లేదంటా?" చిన్న చెల్లెలు రెట్టించింది.

"ఇక చాల్లే పండుకోండ్రా - చాలా పొద్దు పొయ్యింది." చిన్నాన్న జోక్యంతో అందరి నోళ్ళూ మూతపడ్డాయి.

రామానుజులుకు వెంటనే నిద్రరాలేదు. ఆలోచనలో పడ్డాడు.

గిరిజనుల్లా పోడు వ్యవసాయం ఒకప్పుడిక్కడా ఉండేదేమో. తర్వాత తర్వాత వ్యవసాయ పని ముట్లకో, వంటకట్టెలకో, మిద్దెలకో, మేడలకో అడవుల్ని నరుక్కుంటూ వచ్చి ఉంటారు. ఏ వ్యాధో వచ్చి సత్రానికి దూరంగా ఒకప్పుడున్న మొగలి పొదల మాదిరి అడవి నాశనమైందేమో. సత్రాల దగ్గరో, బావుల దగ్గరో ఎన్నడో ఎవరో నాటిన వేపచెట్లు, మర్రిచెట్లు లేకపోయి ఉంటే ఈ ఊర్లన్నీ ఒలుకల కట్టల మాదిరి కనిపించేవి. ఆ ఒలుకలకట్టలో ఇళ్ళన్నీ గోరీల మాదిరి. తమ ఎల్లమ్మవనం వేసింది మూడు తరాల కిందటి తమ ముదిజేజి

రామానుజులుకు ఊరిగాలి సోకింది. ఊరివాసన వేసింది. చెట్లూ, ఇళ్ళూ, కళ్ళాలూ, వాములూ కనపడుతున్నాయి. కన్నఊరు వచ్చేసింది.



అని ఊళ్ళో ఘనంగా చెప్పుకుంటారు. ఎందుకు వేసిందో? గొడ్ల నీడకోసమేనా? పుణ్యానికా? తమ కళ్ళంలో వేపచెట్టు నాటింది కూడా ఆమేనని అంటారు. తర్వాత రెండు తరాలవాళ్ళు వీటి మీదెందుకు శ్రద్ధ చూపలేదు? ఆసక్తి లేకనా? తెలియదా? మగవాళ్ళు పోనీలే... పొలంతో నిత్య సంబంధమున్న ఆడవాళ్ళు?

చిక్కుముడి వీడలేదుకానీ, రామానుజులుకు నిద్ర ముంచుకొచ్చింది.

ఉదయాన్నే రామానుజులుకు ఎల్లమ్మ వనంవైపు వెళ్ళాలనిపించింది. వనం లేదు. చెట్లను వేళ్ళతోసహా కుళ్ళగిస్తే, మిగిలిన గుంతలన్నీ కనిపించాయి. తొమ్మిది నెలల కిందట సెలవుల్లో వచ్చినప్పుడున్న వనం స్థానంలో వికృతమైన గుంతలున్నాయి. రామానుజులు నిశ్చేష్టుడయ్యాడు.

రామానుజులుకు చిన్నాన్న మీద విపరీతమైన కోపం వచ్చింది. 'చదువుకున్న మూర్ఖుడు. పూర్వీకుల జ్ఞాపకాల్నిసైతం ధ్వంసంచేసే మనిషి' అని కసిదీరా మనసులో తిట్టాడు. దిగులు, బాధ, కోపం గంటవరకూ తగ్గలేదు.

'చిన్నాన్నను నిలదీసి అడగాల. ఏం భయమా?' అనుకుంటూ ఇంటికి వచ్చిన రామానుజులుకు గొడ్డళ్ళ నరుకుడు శబ్దాలు కర్ణకఠోరంగా వినిపించాయి. ఎవరో తరుముతున్నట్లు రామానుజులు కళ్ళంలోకి పరుగెత్తాడు. చేవదేలిన బ్రహ్మాండమైన వేపచెట్టు మొదలుమీద గొడ్డళ్ళు చిందులు తొక్కుతున్నాయి. దూరంగా చొప్పవామి కింద మంచంలో చిన్నాన్న తలవంచుకొని నేలను చూస్తూ బీడీ తాగుతూ రామానుజులుకు కనిపించాడు. ఆ పక్కన్నే కూచున్న పెద్దమనిషి గొడ్డళ్ళను పర్యవేక్షిస్తున్నాడు.

రామానుజులు విసురుగా వచ్చి మంచం దగ్గర నిల్చున్నాడు. ఆవేశం పట్టలేకపోయాడు.

"ఏందిది చిన్నాన్నా? నీకేమన్నా పిచ్చిపట్టిందా? ఎల్లమ్మజేజి తోపును కొట్టించినారు. ఇప్పుడీ చెట్టును..." ఆపైన రామానుజులుకు మాట పెగల్లేదు.

"ఇంట్లోకి పోదాం పద" అంటూ చిన్నాన్న రామానుజులు చెయ్యి పట్టుకున్నాడు. చిన్నాన్న చెయ్యి చల్లగా ఉంది. ఇంట్లో మంచం మీద రామానుజులును బలవంతంగా కూర్చోబెట్టి, నడవలో నడుస్తూ చిన్నాన్న అన్నాడు:

"చెట్లను ఏ రైతూ నాశనం చేసుకోడు - అవసరం గొంతుమీది కొస్తేతప్ప."

"ఏం అవసరమొచ్చింది?" రామానుజులు గొంతులో జీర పలికింది.

"మీ నాన్న చనిపోయాక మిగిలిన అప్పులు, అమ్మి సుభద్ర పెళ్ళి, నీ ఇంజనీరింగు చదువు, పండీ పండని పంటలు...వనం అమ్మి అప్పులు గట్టినా."

"పొలం అమ్మకూడదా?"

"బయట చెల్లకుండే గిరాకీ ఊళ్ళో మన పొలాలకు లేదు."

సూటిగా చిన్నాన్న రామానుజులు కళ్ళలోకి చూస్తూ మాటలు నొక్కి పలికాడు — పరమ శాంతంగా, ఏ వికారమూ ముఖంలో కనిపించనీకుండా.

"పోనీ కళ్ళంలోని ఆ వేపచెట్టునన్నా మిగిలించకూడదా? పిల్లలు ఆడుకోడానికీ, మానూళ్ళప్పుడూ అది ఉపయోగపడేది. ఆమాత్రం మమకారం లేదా?"

చిన్నాన్న కరకుగా అన్నాడు:

"మమకారాలకేమొచ్చింది? మనుషులకన్నా మాన్లెక్కువకాదు. పరీక్షలయ్యాక కొన్ని బాకీలు తీర్చాలన్నావు. విశాఖపట్నం, అరకు పోవాలన్నావు. రెండు వేలు కావాలని రాసినావు. ఊర్లో దొరకలేదు. కడాకు ఆ కలప అంగడి మల్లారెడ్డి ఇచ్చినాడు - చెట్టుమీద ఆశతో..."

రామానుజులు నెత్తిమీద గొడ్డలి మీద గొడ్డలి వేట్లు పడినట్లయింది. అంతవరకు తెగేదాకా వస్తే తన భాగం ఆస్తిలో కట్టుకోమనీ, వేపచెట్టును చేతులతో చుట్టి రక్షించుకోవాలనీ అనుకున్న జ్ఞానం ఛిద్రమైంది. చిన్నాన్న కళ్ళలోకి చూడలేక, అశక్తతను సహించలేక రామానుజులుకు నోట మాట రాలేదు. చెయ్యీ కాలూ ఆడలేదు.

గొడ్డళ్ళ నరుకుడు చప్పుళ్ళు వినిపిస్తూనే ఉన్నాయి. ■